

జనార్దన్ రావు సెల్‌ఫోన్ ఏమైంది..?

- ముంబాయిలో ఎవరికైనా ఇచ్చాడా?
- దక్షిణాఫ్రికాలోనే వదిలి వచ్చాడా?
- కీలక ఆధారాలు బయటపడతాయనే సెల్‌ఫోన్ మాయం
- జయచంద్రారెడ్డి కోసం ముమ్మర గాలింపు
- నిందితుల కస్టడీ పిటీషన్‌పై నేడు విచారణ



ములకలచెరువులో నకిలీ మద్యం తయారు చేసిన పాత డాబా



నకిలీ మద్యం బాటిళ్లు (ఫైల్)

రాయచోటి/ములకలచెరువు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంచలనం కలిగించిన ములకలచెరువు, ఇబ్రహీంపట్నం నకిలీ మద్యం తయారీ కేసులో అద్దెపల్లె జనార్దన్‌రావు ప్రధాన నిందితుడు. దక్షిణాఫ్రికా నుంచి విమానంలో ముంబాయి వచ్చి అక్కడి నుంచి విజయవాడలోని గన్నవరం విమానాశ్రయానికి వచ్చిన అతడిని ఎక్సైజ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. విజయవాడ ఎక్సైజ్ కోర్టు జనార్దన్‌రావుకు ఈనెల 17వతేదీ వరకు రిమాండ్ విధించడంతో నెల్లూరులోని కేంద్ర కారాగారానికి తరలించారు. రిమాండ్‌కు ముందు జనార్దన్‌రావును విచారించిన ఎక్సైజ్ ఉన్నతాధికారులు సెల్‌ఫోన్ గురించి ఆరా తీయగా ముంబాయి విమానాశ్రయంలో పోయిందని చెప్పినట్లు సమాచారం. తన సెల్‌ఫోన్‌లో ఉన్న కాల్‌లిస్ట్, ఫొటోలు, ఎస్‌ఎంఎస్‌లు, నగదు లావాదేవీలు తదితర అంశాలు బయటపడతాయని సెల్‌ఫోన్ మాయం చేసినట్లు తెలుస్తోంది. దీంతో అధికారులు నెట్‌వర్క్ ఆపరేటర్‌ను పిలిపించి జనార్దన్‌రావు వేలిముద్రలు వేయించి అప్పటికప్పుడు కొత్త సిమ్‌ను తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. కేసులో కీలక ఆధారాలు బయటపడకుండా సెల్‌ఫోన్‌ను మాయం చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇతను దక్షిణాఫ్రికాలోనే సెల్‌ఫోన్‌ను వదిలి వచ్చాడా? లేదా ముంబాయి విమానాశ్రయంలో ఎవరి చేతికైనా ఇచ్చి వచ్చాడా? అనే కోణంలో ఎక్సైజ్ అధికారులు ఆరా తీస్తున్నారు. జనార్దన్‌రావు పేరు మీద మరో సిమ్‌ను తీసుకున్న ఎక్సైజ్ ఉన్నతాధికారులు కాల్‌డేటా కోసం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్లు తెలిసింది. కాల్‌డేటా వస్తే జనార్దన్‌రావుతో సత్సంబంధాలు ఉన్న మరికొంత మంది పేర్లు బయటకు వచ్చే అవకాశం ఉంది.

గోవా, హైదరాబాద్‌లకు ప్రత్యేక బృందాలు

ములకలచెరువు, ఇబ్రహీంపట్నం కేంద్రాలుగా జరిగిన నకిలీ మద్యం తయారీకి సంబంధించి స్పిరిట్, ముడి పదార్థాలను బెంగళూరుకు చెందిన బాలాజీ ముంబాయి, ఢిల్లీ, బెంగళూరు ప్రాంతాల నుంచి సేకరించి ఇక్కడికి తీసుకొచ్చాడని ప్రధాన నిందితుడు జనార్దన్‌రావు ఎక్సైజ్ పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో తెలియజేశాడు. గోవాలోని ఓ మద్యం దుకాణంలో బెంగళూరుకు చెందిన బాలాజీని కలిసిన జనార్దన్‌రావు నకిలీ మద్యంపై చర్చించి తయారీకి అవసరమైన స్పిరిట్, ముడి పదార్థాలు పంపుతానని చెప్పాడు. బాలాజీ చెప్పిన విధంగా ములకలచెరువుకు కూడా స్పిరిట్, ముడి పదార్థాలు సరఫరా చేసేవాడు. అలాగే హైదరాబాదుకు చెందిన రవి నకిలీ లేబుల్స్ సరఫరా చేసేవాడు. రవిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు హైదరాబాదుకు తీసుకెళ్లారు. అక్కడ నకిలీ లేబుల్స్ తయారీ చేస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. రవికి లేబుల్స్ ఇచ్చిన వారు పరారయ్యారు. హైదరాబాదులో నకిలీ లేబుల్స్ తయారు చేస్తున్న వారిని పట్టుకునేందుకు పోలీసులు గాలిస్తున్నారు. అలాగే బెంగళూరుకు చెందిన బాలాజీ పనిచేసిన మద్యం దుకాణాన్ని ప్రత్యేక బృందం పరిశీలించినట్లు తెలిసింది. ముంబాయి, ఢిల్లీ, బెంగళూరులలో ఎక్కడ నుంచి బాలాజీ స్పిరిట్ సేకరించాడో వివరాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. బాలాజీ పట్టుబడితే కీలక స్పిరిట్, ముడి పదార్థాలు ఎక్కడి నుంచి తెచ్చాడో బయటపడనుంది.

జయచంద్రారెడ్డి ఎక్కడ?

ములకలచెరువు నకిలీ మద్యం తయారీలో ఏ1 జనార్దన్‌రావు అరెస్టు కావడంతో ఇప్పుడు జయచంద్రారెడ్డి మీద అందరి దృష్టి మళ్లింది. నకిలీ మద్యం తయారీ వ్యవహారాన్ని అంతా నడిపింది స్నేహితులైన జనార్దన్‌రావు, జయచంద్రారెడ్డి అని తేలిపోయింది. దీంతో ఇప్పుడు ముఖ్యపాత్ర పోషించిన జయచంద్రారెడ్డిని అరెస్టు చేసేందుకు సిద్ధమయ్యారు. బెంగళూరు లేదా ముంబాయిలో ఉన్నట్లు సమాచారంతో ప్రత్యేక బృందాలు అక్కడికి వెళ్లి జయచంద్రారెడ్డి కోసం గాలిస్తున్నాయి. దక్షిణాఫ్రికా నుంచి వచ్చిన జనార్దన్‌రావు, జయచంద్రారెడ్డిలు ముంబాయిలో కలుసుకుని మాట్లాడుకున్నారనే ప్రచారమూ ఉంది. విచారణలో ఏం చెప్పాలో ఇద్దరూ మాట్లాడుకున్న తర్వాతే జనార్దన్‌రావు విజయవాడకు వచ్చినట్లు తెలుస్తోంది. అదే సమయంలో ఈ కేసులో మిగిలిన నిందితులను పట్టుకోవడం ఎక్సైజ్ పోలీసులకు పెద్ద సవాల్‌గా మారింది. గిరిధర్‌రెడ్డి, జయచంద్రారెడ్డి పీఏ రాజేశ్, ఆయన ఇంట్లో పనిచేసే అన్బురాసు, పెద్దతిప్పసముద్రంకు చెందిన చైతన్యబాబు, బెంగళూరుకు చెందిన బాలాజీ, ఆయన కుమారుడు సుదర్శన్‌లను అరెస్టు చేయాల్సి ఉంది. వీరందరి కోసం నాలుగు ప్రత్యేక బృందాలు బెంగళూరులో గాలిస్తున్నారు. ప్రస్తుతానికి గిరిధర్‌రెడ్డి దక్షిణాఫ్రికాలోనే ఉన్నాడు.



అసలును పోలిన నకిలీ మద్యం బాటిల్

నేడు నిందితుల కస్టడీ పిటీషన్‌పై విచారణ

ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేసులో ఇప్పటికే అరెస్టయి మదనపల్లె సబ్‌జైలులో ఉన్న నిందితులను కస్టడీకి కోరుతూ ఎక్సైజ్ అధికారులు తంబళ్లపల్లె కోర్టులో దాఖలు చేసిన పిటీషన్ సోమవారం విచారణకు రానుంది. ఈనెల 3న ములకలచెరువులో జరుగుతున్న నకిలీ మద్యం తయారీ గుట్టురట్టు చేసిన ఎక్సైజ్ ఉన్నతాధికారులు అక్కడికక్కడే 10 మంది నిందితులను అరెస్టు చేశారు. మరుసటి రోజు వీరిని అరెస్టు చూపి కోర్టులో హాజరు పర్చారు. వీరందరూ ప్రస్తుతం మదనపల్లె సబ్‌జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. ఈ కేసుకు సంబంధించి నిందితులను విచారించి పూర్తి వివరాలు రాబట్టాల్సి ఉందని, వీరిని కస్టడీకి ఇవ్వాలని ఈనెల 7న తంబళ్లపల్లె కోర్టులో ఎక్సైజ్ పోలీసులు పిటీషన్ చేశారు. తంబళ్లపల్లె జడ్జి విచారణను ఈనెల 10వ తేదీకి వాయిదా వేశారు. తర్వాత ఈ పిటీషన్ విచారణను ఈనెల 13కి వాయిదా వేశారు. ఈ పిటీషన్ నేడు తంబళ్లపల్లె కోర్టులో విచారణకు రానుంది.

సంతానలక్ష్మికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

గుర్రంకొండ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రెడ్డెమ్మకొండలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని పరిమళభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు పూజలను చేశారు. సంతానం లేని దంపతులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చి అర్చకులిచ్చే ఆకు పసరును తాగి, కోనేరులో మునిగి తడి బట్టలతో అమ్మవారి చెంత ఒరపడ్డారు. సంతానం కలిగిన దంపతులు మొక్కులు తీర్చుకోవడానికి అధిక సంఖ్యలో రావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో రద్దీగా మారాయి. భక్తులు కొబ్బరికాయలను సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఈవో మంజుల, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

- కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి (నేతాజీ సర్కిల్), అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10 నుంచి నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆల్ ది బెస్ట్

- నేడు బడుల్లో అడుగు పెట్టనున్న కొత్త టీచర్లు



చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025 ద్వారా ఎంపికై శిక్షణ పూర్తి చేసుకున్న టీచర్లు సోమవారం వారికి కేటాయించిన బడుల్లో అడుగుపెట్టనున్నారు. ఉద్యోగాలకు ఎంపికైన ఉమ్మడి చిత్తూరు జిల్లా వారికి ఈనెల మూడు నుంచి పదో వరకు చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో శిక్షణ తరగతులు నిర్వహించగా 1,394 మంది హాజరయ్యారు. వీరికి కౌన్సెలింగ్ పూర్తి చేశారు. శని, ఆదివారాల్లో పోస్టింగ్ ఆర్డర్లు జనరేట్ అయ్యాయి. సోమవారం తమకు కేటాయించిన బడుల్లో చేరనున్నారు. గైర్హాజరైన ఏడుగురికి త్వరలో విజయవాడలో శిక్షణ తరగతులు నిర్వహించి స్థానాలు కేటాయిస్తారు. కొత్త టీచర్లు కౌన్సెలింగ్ ప్రొసీడింగ్స్ కాపీలు మూడు తీసుకెళ్లాలి. ఒకటి వారు పనిచేయనున్న స్కూలుకు, మరొకటి ఎంఈవో కార్యాలయానికి, చివరిది తన వ్యక్తిగత ఫైల్‌లో ఉంచుకోవాలి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మదనపల్లె నియోజకవర్గంలో మొత్తం 96 ఖాళీలుండగా డీఎస్సీ ద్వారా 29 పోస్టులు భర్తీ అయ్యాయి. పీలేరులో 72 ఖాళీలుండగా 42 పోస్టులు, తంబళ్లపల్లెలో 178 ఖాళీలుండగా 116 పోస్టులు భర్తీ అయ్యాయి.

నకిలీ మద్యం వ్యవహారంలో
కాణిపాకంలో ప్రమాణానికి సిద్ధమా?

- జగన్‌కు మంత్రి మండిపల్లి సవాల్



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువులో బయటపడిన నకిలీ మద్యం వ్యవహారంలో నాకు సంబంధం ఉందని మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాపైన విమర్శలు చేస్తున్నారు. అయితే నాకు ఎటువంటి సంబంధం లేదు. ఆ మాట మీదే నేను కాణిపాకంలో ప్రమాణానికి సిద్ధం.. జగన్ నీవు సిద్ధమేనా? అని రాష్ట్ర యువజన, క్రీడా, రవాణా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సవాల్ విసిరారు. రాయచోటి పట్టణంలోని ఆయన కార్యాలయంలో ఆదివారం ఉదయం మంత్రి మీడియా సమావేశంలో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి హోదాలో ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి మా నాయకుడు చంద్రబాబునాయుడు, నారా లోకేశ్, మంత్రిగా ఉన్న నాపైన విమర్శలు చేశారు. జగన్‌మోహన్‌రెడ్డికి నేను ఛాలెంజ్ విసురుతున్నా.. రండి కాణిపాకం వెళ్లి వినాయకుడి వద్ద ప్రమాణం చేద్దాం.. నకిలీ మద్యంలో మేము భాగస్వామ్యం అయి ఉంటే ఆ దేవుడే మమ్మల్ని చూసుకుంటాడు అన్నారు. మీరు చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకే మాపై ఆరోపణలు చేస్తున్నారు. మా పార్టీలో ఉన్న నాయకులు చిన్న తప్పు చేసినా మా ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటారు. ములకలచెరువు ఘటనలో కూడా రాష్ట్ర ఎక్సైజ్ చట్ట పరిధిలో ఎవరు తప్పు చేసినా వారిని తీసుకుని శిక్షిస్తాం. ఇందులో భాగంగానే టాస్క్‌ఫోర్ పనిచేస్తోంది. ఇందులో తప్పు చేసిన వారందరినీ విచారించి జైలుకు పంపించామన్నారు. మీ ప్రభుత్వంలో దళిత డ్రైవర్‌ను చంపిన ఎమ్మెల్సీని ఈరోజు మీ వెంట పెట్టుకుని తిప్పలేదా, ఆరోజు అతడిపై ఏమైనా చర్యలు తీసుకున్నారా అని ప్రశ్నించారు. నెల్లూరు జిల్లాలో ఒక మహిళా శాసనసభ్యురాలిని ఒక మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే అసభ్యకరంగా మాట్లాడిన ఘటనను రాష్ట్రంతో పాటు భారతదేశ వ్యాప్తంగా వ్యతిరేకిస్తూ ఘటన జరిగిన ఒక నెలకే వాళ్ల ఇంటికి వెళ్లి ఆయనతో విందు చేసుకుని వెళ్లలేదా అని విమర్శించారు. మెడికల్ కాలేజీలపైన కోటి సంతకాలు అంట అయ్యా మీరు కోటి సంతకాలు పెట్టించాలంటే మీకు ఎలెక్షన్‌లో వచ్చిన ఓట్లే కోటి ఉన్నాయి. మీరు ఎన్ని సంతకాలు పెట్టిస్తారు. జగన్‌మోహన్‌రెడ్డిని ఆయన పార్టీని ప్రజలు ఎక్కడ మరిచిపోతారో అనే భ్రమలో నేడు ఏదో ఒక కార్యక్రమం పేరుతో ప్రజల్లోకి వస్తున్నారని తెలిపారు. ప్రైవేటీకరణకు, పీపీపీకి తేడా తెలియకుండా మాజీ ముఖ్యమంత్రి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. తెలుగుదేశం హయాంలోనే రాష్ట్రంలో అనేక ప్రముఖ మెడికల్ కాలేజీలు వచ్చాయని అవి ప్రజలకు సేవలందిస్తున్నాయని తెలిపారు.

సైన్స్ సెమినార్‌లో పాల్గొనండి

- జిల్లా విద్యా శాఖాధికారి సుబ్రహ్మణ్యం

రాయచోటి (నేతాజీ సర్కిల్), అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ పోటీల్లో పాల్గొనేటట్లు ప్రధానోపాధ్యాయులు చూడాలని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం ఆదివారం ఒక ప్రకట నలో పేర్కొన్నారు. రాయచోటి పట్టణంలోని డైట్ కళాశాలలో 14వ తేదీ మంగళవారం ఉదయం 9 గంటలకు జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విశ్వేశ్వరయ్య టెక్నలాజికల్ మ్యూజియం వారి సౌజన్యంతో పాఠశాల స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు సైన్స్ సెమినార్ నిర్వహిస్తున్నామన్నారు. క్వాంటం యుగం ప్రారంభం, సంభావ్యతలు, సవాళ్లు అనే అంశంపై సెమినార్ జరుగుతుందని ఆయన అన్నారు. శాస్త్రీయ ఆలోచనలను సమర్థవంతంగా వ్యక్తీకరించడానికి విద్యార్థులకు ఇది ఒక వేదిక అని తెలిపారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 8, 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనడానికి అర్హులన్నారు. సెమినార్‌లో ఇచ్చిన అంశంపై రాత పరీక్ష, ప్రజంటేషన్, క్విజ్ ద్వారా విద్యార్థులను పరీక్షించి విజేతలను ఎంపిక చేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థి 5 చార్టులు/స్లైడులు ఉపయోగించుకొని గరిష్టంగా 6 నిమిషాల పాటు ప్రజెంటేషన్ ఇవ్వాలన్నారు. ఒక పాఠశాల నుంచి ఒక విద్యార్థికి మాత్రమే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనడానికి అనుమతి ఉంటుందన్నారు. జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ నుంచి అత్యుత్తమ ప్రదర్శన కనపర్చిన ఇద్దరు విద్యార్థులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. వీరు 15వ తేదీ విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనాలన్నారు. రాష్ట్ర స్థాయి విజేతలకు 30వ తేదీ జాతీయ స్థాయి సైన్స్ సెమినార్ బెంగళూరులో జరుగుతుందన్నారు. కాబట్టి ఆసక్తి కలిగిన విద్యార్థులు జిల్లా స్థాయి సైన్స్ సెమినార్‌లో పాల్గొనేటట్లు చొరవ చూపాలని ప్రధానోపాధ్యాయులకు ఆయన సూచించారు.

వైవీయూ వీసీగా ప్రొఫెసర్ రాజశేఖర్

- నేడు బాధ్యతల స్వీకరణ



కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాలకు తలమానికంగా నిలిచిన యోగివేమన విశ్వవిద్యాలయానికి వైస్ చాన్సలర్‌గా ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్‌ను ప్రభుత్వం ఈనెల 8న నియమించింది. కూటమి ప్రభుత్వం రెగ్యులర్ వీసీని నియమించి విశ్వవిద్యాలయానికి ఒక కొత్త అధ్యాయానికి నాంది పలికింది. అనేక రంగాల్లో నైపుణ్యం కలిగిన ఆయన దూరదృష్టి, దృఢ సంకల్పం వైవీయూ విద్యా, పరిశోధన వ్యవస్థలకు కొత్త ఉత్సాహాన్ని నింపనున్నాయని, వర్సిటీని సమర్థవంతంగా నడిపించడంతో పాటు పేరు ప్రఖ్యాతలు తీసుకువస్తారని మేధావి వర్గం అభిప్రాయపడుతున్నారు. కాగా వైవీయూ ఉపకులపతిగా నియమితులైన రాజశేఖర్ సోమవారం ఉదయం 11గంటలకు బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి వీసీగా విధులు నిర్వహించిన ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు నూతన వీసీకి బాధ్యతలు అప్పగించనున్నారు.

కృష్ణాజలాలు నిలిపివేత

కొండాపురం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టుకు అవుకు రిజర్వాయర్ నుంచి ఆదివారం కృష్ణాజలాలు నిలిపివేసినట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. దీంతో జీఎన్ఎస్ఎస్ వరదకాలువ ద్వారా అవుకు నుంచి గండికోటకు వచ్చే నీటిప్రవాహం పూర్తిగా నిలిచిపోయిందన్నారు. ప్రస్తుతం గండికోట నుంచి సీబీఆర్‌కు 500 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటిమట్టం 26.436 టీఎంసీలుగా ఉందని ఈఈ తెలిపారు.

హంద్రీ-నీవా కాలువలో విద్యార్థి గల్లంతు 7

అరుదైన అపూర్వ కలయిక

- మేడికుర్తి హైస్కూల్‌లో ఆవిష్కృతం
- 1968-69 బ్యాచ్ ఎస్ఎస్‌సీ విద్యార్థుల కలయిక

కలికిరి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఆదివారం ఎక్కడో ఒక హైస్కూల్లో పూర్వ విద్యార్థుల అపూర్వ కలయికలు ఇప్పుడు సాధారణమయ్యాయి. ఆధునిక సాంకేతికత, సామాజిక మాధ్యమాలు విస్తృతం కావడం కూడా ఇందుకు సహకరిస్తోంది. ఇక సాఫ్ట్‌వేర్ టెకీలు తమ బాల్యదశలోని సహచరులను పోగేసి తాము చదివిన పాఠశాలల్లో సమావేశాలు కావడం, తమ గురువులను స్మరించి సత్కరించడం, వీలైతే ఆ పాఠశాలలో అదనపు సదుపాయాల కోసం చేయూతనివ్వడం పరిపాటిగా మారింది. ఇవన్నీ ఒక ఎత్తయితే ఆదివారం మండలంలోని మేడికుర్తి జడ్పీ హైస్కూల్లో ఆవిష్కృతమైన సన్నివేశం అపూర్వం.. అపురూపం.. అరుదైంది. ఈ హైస్కూల్లో 1968-69 ఎస్ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం ఒకచోట చేరి పాత ముచ్చట్లతో మురిసిపోయారు. అంటే సరిగ్గా 57 ఏళ్ల క్రితం నాటి సహచరులు. అప్పటి విద్యార్థుల ప్రస్తుత వయసు 73 ఏళ్లు. ఆ పైబడిన వాళ్లూ ఉన్నారు. వీళ్లంతా పాత ఎస్ఎస్ఎల్‌సీ (11వ తరగతి) శకం ముగిసి ఎస్ఎస్‌సీ ప్రారంభమైన మొదటి బ్యాచ్ విద్యార్థులు. ఇదంతా ఒక ఎత్తయితే వీరికి చదువు చెప్పిన అప్పటి ఆరుగురు గురువులను అత్యంత శ్రమకోర్చి ఏరికోరి ఒకచోట చేర్చడం మరింత అద్భుతంగా కుదిరింది. గురువులందరూ 85 ఏళ్ల పైబడిన వారే కావడం మరింత విశేషం. గురువులు ఓబుల్ రెడ్డి, రాజారెడ్డి, రాధాకృష్ణ, నారాయణ, ఎం.ఓబుల్‌రెడ్డి, షరీఫ్ సాహెబ్‌లను విద్యార్థులంతా పాదపూజ చేసి ఘనంగా సన్మానించి భావోద్వేగాలకు లోనయ్యారు. అందులో మరీ విశేషంగా కనబడిన 93 ఏళ్ల వయసు దాటిన గురువు రాజారెడ్డి సమావేశానికంతా హైలైట్ అయ్యారు. ఈయన స్వస్థలం కలకడ మండలం నడిమిచెర్ల. విద్యార్థుల్లోనూ అనేకమంది పదిహేనేళ్ల క్రితం పదవీ విరమణ చేసిన విశ్రాంత ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగులున్నారు. ఈ కార్యక్రమాన్ని అపూర్వ విద్యార్థులు ఎ.సయ్యద్ సాహెబ్, జయరత్నమ్మ, చంద్రశేఖర్ రెడ్డి, రెడ్డికుమార్‌లు ఏర్పాటు చేశారు. 36 మంది విద్యార్థులు, ఆరుగురు గురువులు హాజరయ్యారు. మొత్తానికి సాంకేతిక పరిజ్ఞానం అంతగాలేని 73 ఏళ్ల వయసువారు ఇంత గొప్పగా అందరినీ ఒకచోట చేర్చడం గర్వకారణమని అందరూ అంటున్నారు.



93 ఏళ్ల వయస్సు ఉన్న గురువు రాజారెడ్డిని సత్కరిస్తున్న 73 ఏళ్ల విద్యార్థులు



73 ఏళ్ల విద్యార్థులు, 85 ఏళ్లు దాటిన గురువులు

నడకతో ఆరోగ్యం పదిలం

- డీఎస్పీ మహేంద్ర
- మల్లయ్యకొండ ఎక్కిన పోలీసు అధికారులు



వేంపల్లె మల్లయ్యకొండ ఎక్కుతున్న డీఎస్పీ మహేంద్ర, పోలీసు అధికారులు

మదనపల్లె టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజూ మనిషి కనీసం 40 నిమిషాలు నడవాలని, అప్పుడే అతను ఆరోగ్యంగా ఉంటాడని మదనపల్లె డీఎస్పీ మహేంద్ర తెలిపారు. ఆదివారం మదనపల్లె మండలం వేంపల్లె మల్లయ్యకొండపై ఉత్సాహవంతులైన పోలీసు అధికారులతో డీఎస్పీ ట్రెక్కింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నిత్యం విధి నిర్వహణలో ఒత్తిడితో ఉండే పోలీసులకు వ్యాయామం కొంత రిలాక్స్ ఇస్తుందన్నారు. ఇందులో భాగంగా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి అనుమతితో వేంపల్లె మల్లయ్యకొండను అధిరోహించామన్నారు. ప్రతి ఆదివారం ఆరోగ్యం కోసం ఆదివారం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఉదయాన్నే మల్లయ్యకొండపై వాతావరణం, అక్కడి నుంచి మదనపల్లె పట్టణం ఏరియల్ వ్యూ అద్భుతంగా ఉందన్నారు. నడకతో పోలీసు అధికారుల్లో కొత్త ఉత్సాహం వచ్చిందన్నారు. కార్యక్రమంలో తాలూకా సీఐ కళా వెంకటరమణ, ఎస్ఐలు అన్సర్‌బాషా, చంద్రమోహన్, దిలీప్‌కుమార్, తిప్పేస్వామి, నరసింహులు, డీఎస్పీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రియురాలు చనిపోయిందని
సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య


మృతి చెందిన ఫారూక్

రాయచోటి(నేతాజీ సర్కిల్), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రేమించిన అమ్మాయి చనిపోయిందని ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మనస్థాపానికి గురై ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కన్నకొడుకు మృతదేహాన్ని చూసి ఆ తల్లిదండ్రుల హృదయం తరుక్కుపోయింది. తాము ఎవరి కోసం బతకాలంటూ కన్నీటి పర్యంతమయ్యారు. వారి ఆర్తనాదాలు అందరినీ కంటతడి పెట్టించాయి. ఈ సంఘటన సంబేపల్లె మండలం దేవపట్ల గ్రామం ఆవులవాండ్లపల్లెలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సంబేపల్లె మండలం దేవపట్ల గ్రామం ఆవులవాండ్లపల్లెకు చెందిన బాదుల్లా బాషా, సల్మా దంపతుల కుమారుడు షేక్ ఫారూక్ (22) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడని తెలిపారు. నాలుగేళ్లుగా హైదరాబాదులో ఉద్యోగం చేస్తూ అక్కడ ఒక యువతి ప్రేమించినట్లు తెలిపారు. ఆమెకు ఏమైందో తెలియదు, కొద్దిరోజుల క్రితం ఆమె మృతి చెందిందని, దీంతో మనస్థాపానికి గురైన ఫారూక్ ఇంటికి వచ్చాడని తెలిపారు. ఆదివారం తల్లీతండ్రి పొలం వద్దకు వెళ్లిన సమయంలో ఇంటిలో ఎవరూ లేకపోవడంతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు కొడుకు మృతి చెందడంతో ఇక తామెవరి కోసం బతకాలంటూ బోరున విలపించారు. విషయం తెలుసుకున్న ఏఎస్ఐ బాదుల్లా సంఘటన స్థలానికి చేరుకొని మృతికి గల కారణాలపై ఆరా తీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మనస్థాపంతో యువకుడి మృతి


మృతి చెందిన అరుణ్‌కుమార్

దువ్వూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం ఇడమడక సమీపంలో మూతపడిన ఓ డాబాలో అరుణ్‌కుమార్ (19) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం ఉదయం అందిన సమాచారం మేరకు స్థానిక పోలీసులు అక్కడకు వెళ్లి సంఘటనను పరిశీలించారు. మృతుడు ఆళ్లగడ్డ ప్రాంతంలోని యాదవవాడ గ్రామానికి చెందినవాడని ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. ప్రేమించిన విషయంలో మనస్థాపానికి గురై ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

నిప్పంటించుకుని వ్యక్తి మృతి

సీకేదిన్నె, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని కొండపల్లె గంగన్న(57) మృతి చెందినట్లు సీకేదిన్నె పోలీసులు తెలిపారు. కడప రాజారెడ్డి వీధికి చెందిన గంగన్న ఆదివారం రాత్రి 7గంటల సమయంలో మండలంలోని మామిళ్లపల్లె పంచాయతీ రామచంద్రయ్యకాలనీకి బైక్‌పై వచ్చి రెండు లీటర్ల పెట్రోల్ తెచ్చుకుని ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నారని తెలిపారు. మంటల తాకిడి తట్టుకోలేక కేకలు వేయడంతో స్థానికులు గమనించి సీకే దిన్నె పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకునేలోపల గంగన్న మృతి చెందినట్లు గుర్తించారు. మృతికి గల కారణాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

జమ్మలమడుగు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని భాగ్యనగర్ కాలనీలో షేక్ పెద్ద హసన్‌సాహెబ్ (45) అనే వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఇంట్లో ఎవరికీ చెప్పకుండానే ఇంటి నుంచి వెళ్లిపోయాడని ఆదివారం ఉదయం అర్బన్ పోలీసుస్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అదృశ్యమైన వ్యక్తి కోసం విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

అదుపు తప్పి చెట్టును ఢీకొన్న వాహనం


దెబ్బతిన్న కారు ముందుభాగం

వేముల, అక్టోబరు 12(ఆంధ్ర జ్యోతి): మండలంలోని గొందిపల్లె సమీపంలో కడప-పులివెందుల ప్రధాన రహదారిలో ఓ కారు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొట్టింది. ఆదివారం సాయంత్రం జరిగిన ఈ ప్రమాదంలో కారులో ఉన్న పులివెందుల వైసీపీ నాయకుడు హాల్ గంగాధర్‌రెడ్డి, ఆయన సోదరుడు గాయపడ్డారు. చెట్టుకు ఢీకొట్టడంతో కారు ముందుభాగం దెబ్బతినింది. ఆ సమయంలో వేంపల్లె నుంచి పులివెందులకు వెళ్తున్న డీఎస్పీ మురళీనాయక్ గాయపడిన వారిని పులివెందులలోని ఓ ప్రైవేట ఆసుపత్రికి తన వాహనంలో తరలించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

కొండాపురం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.కోడూరు గ్రామం సమీపంలోని పెన్నానది వద్ద ఆదివారం పోలీసులు ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. అనంతపురం జిల్లా వీరాపురానికి చెందిన ట్రాక్టర్ అనుమతి లేకుండా నదిలో ఇసుకను తరలిస్తుండగా ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్సై శివనాగిరెడ్డి తెలిపారు. ట్రాక్టర్‌ను రెవెన్యూ అధికారులకు అప్పగించనున్నట్లు తెలిపారు.

బస్‌షెల్టర్, సర్వీసు రోడ్డు నిర్మాణం జరిగేనా..?

- ఆరేళ్లుగా అడుగుతున్నా నిర్లక్ష్యమే
- నిబంధనలు పాటించని హైవే అధికారులు
- ఆందోళనకు సిద్ధమవుతున్న ప్రజలు


సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయకపోవడంతో రోడ్డు అంచున ఏర్పాటు చేసిన చిరువ్యాపార బండ్లు


చెన్నూరులో బస్‌షెల్టరు నిర్మించకపోవడంతో ఖాళీగా ఉన్న స్థలం ఇదే..

చెన్నూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): హైవేలో ఎలాంటి అభివృద్ధి పనులు మిగలకుండా పూర్తి చేయాలని నిబంధనలున్నా ఇప్పటి వరకు నిర్లక్ష్యమే తప్ప పనులు పూర్తిచేసే దిశగా ఒక్క అడుగు కూడా పడలేదు. ప్రజాప్రతినిధులు ప్రతి సమావేశంలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని, ప్రజలకు మంచి సౌకర్యాలు కల్పించాలని పదేపదే చెబుతున్నా వారి మాటలకు విలువ లేకుండాపోతోంది. మండల కేంద్రంలో కానీ, హైవే దారిలో గ్రామాలు ఉన్నచోట సర్వీసురోడ్లు, బస్‌షెల్టరు ఏర్పాటు చేయాలనే నిబంధనను హైవే అధికారులు పూర్తిగా తుంగలో తొక్కేశారు. దీంతో మండల కేంద్రమైన చెన్నూరు కొత్త రోడ్డులో సర్వీసు రోడ్డు, బస్‌షెల్టరు నిర్మాణం జరగక ప్రజలు పడే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. చిన్నమాచుపల్లె వద్ద తప్ప మండలంలో ఇంకెక్కడా సర్వీసు రోడ్లు చేపట్టలేదు. హైవే అధికారులు స్థలం చూపించినా దాతలు కట్టిస్తామని చెబుతున్నా పట్టించుకునే నాథుడే లేడని ప్రయాణికులు వాపోతున్నారు. ఫలితంగా బస్సుల కోసం ఎదురుచూసే సమయంలో ముఖ్యంగా వేసవికాలం, వర్షాకాలంలో ప్రయాణికులు పడే ఇబ్బందులు వర్ణనాతీతం. ఈ హైవే రోడ్డుపై కొత్త రోడ్డు ప్రాంతం మీదుగా నిత్యం వేలాది మంది ద్విచక్ర వాహనాలు, కార్లు, బస్సులలో రాకపోకలు సాగిస్తుంటారు. ఇలాంటి చోట సర్వీసు రోడ్డు ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నిస్తున్నారు. కేవలం 400 మీటర్ల మేర ఇరువైపులా సర్వీసు రోడ్డు ఏర్పాటు చేసి ఉంటే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉండేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సర్వీసు రోడ్లు, బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఆరేళ్లుగా ఇదే తంతు

2009లో హైవే కోసం తీసుకున్న స్థలంలో 2012 నాటికి రోడ్డు పూర్తయింది. ఆ తరువాత చాలా ఏళ్లకు సర్వీసు రోడ్లు, బస్‌షెల్టరు కావాలని ప్రజలు అడిగినప్పుడల్లా హైవే అధికారులు ఏదో ఒక సాకు చెప్పి తప్పించుకుంటున్నారు. దీంతో పలుమార్లు రోడ్డుపై ఆందోళన చేపట్టారు. ఇలా చేసినప్పుడల్లా హైవే మేనేజరు రావడం.. ఏవో మాయమాటలు చెప్పి తప్పించుకోవడం ఒక తంతుగా జరుగుతోంది.

ఎమ్మెల్యే చెప్పినా నిర్లక్ష్యమే..

సర్వీసు రోడ్లు, బస్‌షెల్టరు నిర్మించాలని చెన్నూరులో జరిగిన ప్రతి మండల సమావేశంలో ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి హైవే అధికారులను ఆదేశించారు. పైగా పలుమార్లు తీవ్ర స్వరంతో కూడా చెప్పడం జరిగింది. అయినా ఎమ్మెల్యే మాటలను కూడా నిర్లక్ష్యంగా కొట్టిపడేస్తున్నారు. మరి ఈ సర్వీసు రోడ్లు ఎప్పుడు వేస్తారో, బస్ షెల్టరు ఎప్పుడు కడతారో తెలియని పరిస్థితి.

ఆందోళనకు సిద్ధమవుతున్న ప్రజలు

హైవే రహదారిలో ఇప్పటి వరకు సర్వీసు రోడ్లు కానీ, బస్‌షెల్టరు కానీ చేపట్టకపోవడంతో ప్రజలు ఆందోళనకు సిద్ధమయ్యారు. స్థలం ఉన్నా నిర్మాణం చేపట్టడంలో హైవే అధికారుల నిర్లక్ష్యమే ప్రధానంగా కనిపిస్తోంది. దీంతో పలుమార్లు జిల్లా అధికారులు వచ్చి మందలించినా వారి మాటలు బేఖాతరు చేస్తున్నారు. దీంతో ఆగ్రహించిన ప్రజలు అభివృద్ధి పనుల కోసం త్వరలో ఆందోళన బాటపట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.


ఎండలోనే బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

వీవోఏల పోరాటాల ఫలితంగానే కాలపరిమితి సర్క్యులర్ రద్దు

- వీవోఏల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి



సభలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి

రాయచోటిటౌన్, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ ఆధ్వర్యంలో డీఆర్‌డీఏలోని వెలుగు పథకంలో పనిచేస్తున్న వీవోఏలు చేసిన నిరవధిక పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేసిందని వీవోఏల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి అన్నారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో వెలుగు యానిమేటర్ల జిల్లా మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ వీవోఏల అభివృద్ధికి ప్రభుత్వం నాణ్యమైన సెల్‌ఫోన్లు ఇస్తామనడం హర్షించదగ్గ విషయమన్నారు. అలాగే హెచ్‌ఆర్ పాలసీ అమలు చేసి కనీస వేతనం ఇవ్వాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.10 లక్షలు చేస్తే ప్రమాద బీమా కలుగుతుందని, చనిపోయిన వారికి మట్టి ఖర్చులు ఇవ్వడంతో పాటు సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. అనంతరం వీవోఏల సంఘం రాష్ట్ర కోశాధికారి తిరుపతయ్య మాట్లాడుతూ ఈనెల 27, 28వ తేదీల్లో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నంద్యాల వీవోఏల సంఘం జిల్లా అధ్యక్షుడు సోమన్న, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజులు, భాగ్యలక్ష్మి, వీవోఏల సంఘం నాయకులు రెడ్డెప్పరెడ్డి, కృష్ణమ్మ, సుబ్రమణ్యం, పరంజ్యోతి, ఉత్తప్ప, పవన్, ఆనంద్, నిర్మల, రెడ్డెప్ప, వారద, నాగసులోచన, శివశంకర్‌రెడ్డి, రమణారెడ్డి, శంకరమ్మ, నరసమ్మ, సుగుణమ్మ, రమణకుమారి, గురవయ్య, యానిమేటర్లు పాల్గొన్నారు.

హంద్రీ-నీవా కాలువలో విద్యార్థి గల్లంతు

- గాలింపు చర్యలు చేపట్టిన ఫైర్ సిబ్బంది


సాయికిరణ్ (ఫైల్)

మదనపల్లె, అర్బన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా కాలువలో పడి పదవ తరగతి విద్యార్థి ఆదివారం సాయంత్రం గల్లంతైన సంఘటన మదనపల్లెలో జరిగింది. విషయం తెలుసుకున్న వెంటనే మదనపల్లె ఫైర్ సిబ్బంది కాలువలో గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేదు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మదనపల్లె పట్టణం రామారావు కాలనీకి చెందిన సురేశ్, సరళ దంపతులు టమోటా మార్కెట్‌లో దినసరి కూలీలుగా పనిచేస్తారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అందులో పెద్ద కుమారుడు సాయికిరణ్ (16) స్థానిక అభ్యుదయ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఆదివారం మధ్యాహ్నం తన మిత్రులైన భానుతేజా, శేషబాబు, సాత్విక్‌రెడ్డిలతో కలిసి బైక్‌పై వెళ్లి వడ్డిపల్లె సమీపంలో హంద్రీ-నీవా కాలువలో ఈత ఆడటానికి దిగి గల్లంతయ్యాడు. మిత్రులు ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు తెలపడంతో వారు అక్కడికి చేరుకుని రోదించారు. ఫైర్ సిబ్బంది ఎంత గాలించినా ఆచూకీ దొరకలేదు. చీకటి పడటంతో సోమవారం ఉదయం తిరిగి గాలింపు చేపడతామని తెలిపారు.


కాలువ గట్టుపై రోదిస్తున్న మృతుడి తల్లి, బంధువులు

క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్

- స్కేటింగ్ అధికారి ఇజ్రాయిల్


జిల్లా స్థాయి స్కేటింగ్‌లో ప్రతిభ కనబరచిన విద్యార్థులు

రాజంపేట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించినప్పుడే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని స్కేటింగ్ అధికారి ఇజ్రాయిల్ అన్నారు. ఆదివారం కడప నగరంలో జిల్లాస్థాయి స్కేటింగ్ పోటీ నిర్వహించారు. ఈ పోటీల్లో రాజంపేట పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల చిన్నారులు పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో భువనేశ్వర్ గోల్డ్‌మెడల్ సాధించగా భవ్య, తేజ, సాయి, మను, మనస్విత రజత పతకాలు, జమాల్‌పల్లి కాంస్య పతకం సాధించినట్లు స్కేటింగ్ మాస్టర్ వినోద్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపుపై దాడి

- వ్యక్తి అరెస్టు.. మద్యం బాటిళ్లు స్వాధీనం

ములకలచెరువు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడుపల్లె పంచాయతీ కనుగొండవారిపల్లెలో ఆదివారం బెల్ట్‌షాపుపై దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు. గ్రామంలో మద్యం విక్రయిస్తున్న జయరాం (54)ను అరెస్టు చేసి అతని వద్ద నుంచి 38 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా బెల్ట్‌షాపులు నిర్వహిస్తే తమ దృష్టికి తీసుకురావాలని ఎస్ఐ సూచించారు.

స్నేహితుడికి చేయూత


- ఇబ్బందులు తెలుసుకుని ఆర్థికసాయం అందించిన మిత్రులు

సీకేదిన్నె, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఎవరికివారే ఎమునా తీరే చందంగా వ్యవహరిస్తున్న ప్రస్తుత సమాజంలో తమ తోటి స్నేహితుడు ఇబ్బందుల్లో ఉన్నాడని తెలిసి మిత్రులంతా కలిసి ఆర్థికసాయం అందించారు. 30 సంవత్సరాల క్రితం కలిసి చదువుకున్న స్నేహితులంతా కలిసి రూ.50వేలను మిత్రుడికి అందించారు. చింతకొమ్మదిన్నె మండలం బయనపల్లి శ్రీవెంకటేశ్వర పాఠశాలలో 1994-95సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులలో బయనపల్లెకు చెందిన తిరుమలశెట్టి రమేశ్ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇటీవల షుగర్ వ్యాధితో బాధపడుతూ ఎక్కువ కావడంతో కాలు కొంత భాగం తొలగించారు. ఈ విషయం తెలుసుకున్న పడిగెలపల్లె గ్రామానికి చెందిన అరిగెల రామచంద్ర మిగతా స్నేహితులకు సమాచారం అందించి తమవంతుగా ఎంతో కొంత సాయం చేద్దామని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు అందరూ కలిసి రూ.50 వేలు పోగు చేశారు. ఆదివారం రమేశ్ ఇంటికి వచ్చి ఈ ఆర్థికసాయం అందించారు. దీంతో రమేశ్ కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. తోటి అన్నదమ్ములే పట్టించుకోని ఈ రోజుల్లో స్నేహితులు అందించిన సాయం అభినందనీయమని పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 1994-95 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు మిత్రులు పాల్గొన్నారు.


రమేశ్‌కు ఆర్థికసాయం అందిస్తున్న మిత్ర బృందం

కుందూలో తగ్గిన నీటిమట్టం

- రైతుల్లో ఆందోళన
- కేసీ కాలువను కప్పుతున్న కంపచెట్లు


కామనూరు వద్ద కుందూలో తగ్గిన నీటిమట్టం

దువ్వూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): కుందూ నదికి, కేసీ కాలువకు అవినాభావ సంబంధం ఉంది. శ్రీశైలం రిజర్వాయర్ ద్వారా కృష్ణా జలాలు కుందూనదిలో పడి రాజోలి ఆనకట్ట వద్ద కేసీ కాలవలోకి ప్రవహిస్తాయి. ఈ నేపథ్యంలో కుందూ ప్రవాహంపై కేసీ నీటిమట్టం ఆధారపడి ఉంది. అయితే కుందూలో ప్రస్తుతం అయిదు వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. పెద్ద వర్షాలు పడిన సమయంలో 35 వేల క్యూసెక్కుల నీరు కూడా కుందూలో ప్రవహిస్తుంది. రాజోలి వద్ద నుంచి ఇడమడక, కానగూడూరు, జిల్లేళ, ఏకోపల్లి, దువ్వూరు, భీమునిపాడు అటు నుంచి మైదుకూరు, ఖాజీపేట నుంచి పెన్నాలో నీరు కలుస్తుంది. ఈ పరిధిలో సుమారు 56 కి.మీ. దూరం కేసీ నీరు ప్రవహిస్తుంది. తద్వారా వేలాది ఎకరాలకు సాగునీరు అందుతుంది. కుందూలో నీటిమట్టం తగ్గినా రైతులు ఏ మాత్రం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు పేర్కొంటున్నారు.

కాలువను కప్పుతున్న కంపచెట్లు

ఈ పరిస్థితుల్లో కేసీ కాలువకు ఇరువైపులా కట్టల మీద కంపచెట్లు విపరీతంగా ఉన్నాయి. ఈ చెట్లు కట్టలను కప్పేస్తుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. చాలా గ్రామాల పరిధిలో రైతులు తమ పొలాల వద్దకు కట్టలమీద నడిచి వెళుతుంటారు. మరికొన్ని చోట్ల రైతులు సత్తువలు, దిగుబడులు, ఇతరత్ర వాటిని కట్టను ఆధారం చేసుకుని పొలాలకు తీసుకెళుతుంటారు. దీంతో కేసీ అధికారులు కంపచెట్ల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.


రాంసాయినగర్ వద్ద కేసీ కాలువ కట్టను కప్పేస్తున్న కంపచెట్లు

మఠాధిపతి నియామకం కోసం సమావేశం

బ్రహ్మంగారిమఠం, అక్టోబర్ 12(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం బ్రహ్మం గారిమఠం మఠాధిపతి నియామకం కోసం ఈనెల 28వ తేదీన ఉదయం 11 గంటలకు పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థాన ప్రాంగణంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు దేవదాయ ధర్మదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనరు చంద్రశేఖర్ ఆజాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ ధార్మిక పరిషత్ నియమించిన అధికారి నేతృత్వంలో ఈ ఎన్నిక జరుగుతుందని, మఠాధిపతి నియామకం కోసం మఠం శిష్యులు, ఆశావహులు హాజరై వారి సందేహాలు, సూచనలు ఆధారాలతో సహా లిఖితంగా క్లుప్తంగా తెలపాలని కోరారు. అనుకోని పరిస్థితుల్లో రాలేకపోయిన వారు కూడా తమ అభిప్రాయాలను పోస్టు ద్వారా పంపవచ్చని ఆ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి బాలికల క్రికెట్ పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థిని


సంధ్య

పుల్లంపేట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ అండర్-19 రాష్ట్రస్థాయి బాలికల క్రికెట్ జట్టుకు పుల్లం పేట ఆదర్శ పాఠశాల సెకండియర్ బైపీసీ విద్యార్థిని సంధ్య ఎంపికైంది. ఆదివారం రైల్వేకోడూరులోని ఎస్వీ జూనియర్ కళాశాలలో నిర్వహించిన సెలక్షన్స్‌లో సంధ్య ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ లీలాశ్రీహరి, పీడీ నీలకంఠరావు తెలిపారు. ఈ సందర్భంగా సంధ్యను ఉపాధ్యాయ బృందం అభినందించారు.

అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబుకే సాధ్యం

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

గాలివీడు, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం ఒక్క చంద్రబాబుకే సాధ్యమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం మండలంలోని అరవీడు పంచాయతీలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలోనే పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలో 64 లక్షల మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ13 వేలు చొప్పున వారి తల్లుల ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పింఛన్లను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచడంతో పాటు, మహిళలకు సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్‌లను ఉచితంగా అందజేశామన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ఒక్కో రైతుకు మొదటి విడతలో రూ.6 వేలు అందజేశామన్నారు. ఉచిత బస్సు సౌకర్యం ద్వారా రాష్ట్రంలోని మహిళలకు ఎంతో ప్రయోజనం కలుగుతున్నదన్నారు. చంద్రబాబు ఆధ్వర్యంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ ఒక్కొకక్కటి నెరవేరుస్తున్నామని తెలిపారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, అధికారులతో మాట్లాడి అక్కడే పరిష్కరించారు.

లక్కిరెడ్డిపల్లె: లక్కిరెడ్డిపల్లె గ్రామంలో మాట్లాడుతూ మండలంలో ఇప్పటికే మూడు కోట్ల రూపాయలతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, ప్రస్తుతం 75 లక్షలతో వివిధ పనులు చేస్తున్నామన్నారు. ⌐ మండల టీడీపీ అధ్యక్షుడు యనమల మదన్‌మోహన్, అటవీ కార్పొరేషన్ డైరెక్టర్ రెడ్డెయ్య, మార్కెట్ యార్డు ఛైర్మన్ ఎస్ఎండీ షఫీనాయక్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ పోలిరెడ్డి సుబ్బారెడ్డి, అన్వర్‌అలీ, ఆరీఫ్, గాజుల ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

రామాపురం: మండలంలోని సరస్వతిపల్లి, హసనాపురం పంచాయతీలోని ఎర్రంగివాండ్లపల్లె, గొల్లపల్లి, హరిజనవాడ గ్రామాల్లో ఆదివారం మంత్రి పర్యటించి సమస్యలను అడిగి తెలుసు కున్నారు. త్వరలో మండలంలోని చెరువులన్నింటికీ నీటిని నింపి తాగు, సాగునీటికి ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. హసనాపురం గ్రామంలో ఉండే టీడీపీ కార్యకర్త ఆటో ఇరగయ్యను, మండలానికి చెందిన అంజనారెడ్డిని పరామర్శించారు. మంత్రి మేనల్లుడు మౌర్యరెడ్డి, కుప్పం నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్ బాషా, సరస్వతిపల్లి సింగిల్‌విండో అధ్యక్షుడు గాలివీటి సురేందర్‌రెడ్డి, కొలిమివాండ్లపల్లె డైరెక్టర్ సహదేవరెడ్డి, అర్చనా విద్యాసంస్థల అధినేత మదన్‌మోహన్‌రెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, పట్టాభిరెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

చిన్నమండెం : బోరెడ్డిగారిపల్లెలో మంత్రి ప్రజా దర్బార్ కార్యక్రమం వినతిపత్రాలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి తక్షణమే అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా మంత్రిని పలువురు నాయకులు సన్మానించారు.



గాలివీడు: ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

రైల్వేకోడూరును తిరుపతి జిల్లాలో కలపాలి

రైల్వేకోడూరు, అక్టోబరు 12 (ఆంధ్ర జ్యోతి): రైల్వేకోడూరును తిరుపతి జిల్లాలో కలపాలని బ్రాహ్మణ అర్చక పురోహిత సమాఖ్య గౌరవాధ్యక్షుడుబండాత్మకూరుసుదర్శన్‌శర్మ తెలిపారు. ఆదివారం రైల్వేకోడూరులోని గాంధీ విగ్రహం వద్ద బ్రాహ్మణ అర్చక పురోహిత సమాఖ్య ఆధ్వర్యంలో ఒక్క రోజు దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రైల్వేకోడూరును తిరుపతి జిల్లాలో చేర్చాలని డిమాండు చేసినా అది ఫలించలేదన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా ఆ పని చేయాలని కోరారు. ప్రస్తుత జిల్లా కేంద్రం నుంచి రైల్వేకోడూరుకు నేరుగా బస్సు సౌకర్యం కూడా లేదన్నారు. తిరుపతికి రైల్వేకోడూరు నుంచి ఏ సమయంలోనైనా ఒక్క గంట వ్యవధిలోనే వెళ్లిపోవచ్చునని తెలిపారు. ఈ సమస్యను జనసేన ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జ్, కుడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, కూటమి నాయకులు కలసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు ఆర్. సుబ్రహ్మణ్యం శర్మ, కూటమి నాయకులు పోతురాజు నవీన్, నార్జాల హేమరాజ్, భక్త జన మండలి నాయకులు ఏ. నరసింహులు, దరిశా వెంకటరెడ్డి, బ్రహ్మాచారి, ఎస్. మల్లికార్జున, సుబ్రహ్మణ్యం, మందపాటి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న బ్రాహ్మణ అర్చక పురోహిత సమాఖ్య నాయకులు

ప్రపంచంలోనే అతిపెద్ద సంస్థ ఆర్‌ఎస్‌ఎస్

● శత జయంతి ఉత్సవాల్లో నాయకులు

రాయచోటి-నేతాజీ సర్కిల్, అక్టోబరు 12 (ఆంధ్ర జ్యోతి): నారాయణరెడ్డిపల్లెలోని మంచా లమ్మ దేవస్థానం ప్రాంగణంలో ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్ శతజయంతి ఉత్సవాలను నిర్వహించినట్లు ప్రధాన వక్త బండి బాలాజీ తెలిపారు. ఆయన ప్రసంగిస్తూ రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్ కోటి మందికి పైగా స్వయం సేవకులతో ప్రపంచంలోనే అతిపెద్ద వలంటరీ ఆర్గనైజేషన్ అన్నారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు స్వయం సేవకులు ప్రాణాలను లెక్కచేయకుండా ప్రజల ప్రాణాలు కాపాడటానికి ముందుంటారని తెలియజేశారు. సేవాభారతి, ఆరోగ్య భారతి, విద్యా భారతి సంస్థల ద్వారా దేశవ్యాప్తంగా లక్షల సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ ఖండ కార్యవాహ మధుసూదన్‌రాజు, గ్రామ పెద్దలు సహదేవరెడ్డి, గజేంద్ర నాయుడు, అంజనేయులు, రెడ్డెన్న, బీజేపీ అన్నమయ్య జిల్లా బీసీ మోర్చా అధ్యక్షుడు రేపన శివప్రసాద్, ఇతర స్వయం సేవకులు పాల్గొన్నారు.

సుండుపల్లె : మండలంలోని రాయవరం, జం గంపల్లి, జీ. రెడ్డివారిపల్లె, సుండుపల్లెలో ఆర్ఎస్ ఎస్ శతాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ చేసిన కృషిని ప్రశంసించారు. జిల్లా ప్రచారకర్త నరసింహ, డాక్టర్ ప్రసాద్, సుబ్రమణ్యం రాజు, స్వయంసేవకులు పాల్గొన్నారు.

చిన్నమండెం: మండలంలోని మల్లూరు దేవ స్థానం వద్ద జరిగిన కార్యక్రమంలో బండి బాలాజీ ప్రసంగిస్తూ దేశంలోని ప్రతి ఒక్కరు దేశభక్తి, ధర్మనిష్ఠ కలిగి ఉంటే భారతదేశాన్ని ప్రపచంలోనే అగ్రగామిగా నిలపడానికి సాధ్యమ వుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్వయం సేవకులు పాల్గొన్నారు.



చిన్నమండెం: శతాబ్ది ఉత్సవాల్లో మాట్లాడుతున్న వక్తలు

'క్రీడలకు పుట్టినిల్లు నందలూరు'

నందలూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : కళలకు, క్రీడలకు పుట్టినిల్లు నందలూరు అని జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎల్లటూరు శివరామరాజు, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్ తెలిపారు. ఆదివారం వారు యంగ్‌మెన్స్ క్యారమ్స్ అసోసియేషన్ వారు నిర్వహిస్తున్న దక్షిణభారత స్థాయి క్రీడా పోటీలను తిలకించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ క్రీడల్లో సైతం జాతీయ, రాష్ట్ర స్థాయిలో రాణించి నందలూరు మండల కీర్తిని దేశ నలుమూలల చాటి చెప్పాలన్నారు. భావితరాల యువత వీరిని ఆదర్శంగా తీసుకుని భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని వారు ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ టోర్నమెంట్ సింగిల్స్ విజేతకు రాజంపేట పార్లమెంట్ జనసేన ఇన్‌చార్జి ఎల్లటూరు శ్రీనివాసరాజు రూ.25 వేలు, సమ్మెట శివప్రసాద్ రూ.10 వేలు బహుమతులను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు బీఎన్ శంకర్, ఆర్ముగం విశ్వనాథ్, షమీవులా ఖాన్, నారాయణ, తోట శివశంకర్, గ్రీష్మంత్‌రెడ్డి, సుధాకర్, నాగభూషణ్, శ్యామ్‌రాజు, తిప్పాయపల్లె ప్రశాంత్, వివిధ పార్టీలకు చెందిన స్థానిక నేతలు వివిధ రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్లటూరు శివరామరాజు

గుండ్రాజుచెరువుకు నీరు మళ్లింపు

చిన్నమండెం, అక్టోబరు12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వండాడి గ్రామ పంచాయతీలోని ఐదు గ్రామాలకు తాగునీరు, సుమారు 80 ఎకరాలకు సాగునీరు అందించే గుండ్రాజు చెరువుకు మాండవ్య నది నుంచి నీరందించే కట్టుకాలువకు మరమ్మతులు చేసి దాని ద్వారా గుండ్రాజుచెరువుకు నీరు మళ్లించారు. చెరువు నిండితే రెండేళ్ల పాటు ఈ ప్రాంత ప్రజలకు నీటి సమస్య ఉండదని కట్టుకాలువకు సహకరించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఆంధ్రజ్యోతికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.



కట్టుకాలువ ద్వారా నీటిని చెరువులోకి మళ్లిస్తున్న రైతులు

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు మృతి

రాయచోటి - నేతాజీ సర్కిల్, అక్టోబరు 12 (ఆంధ్ర జ్యోతి): కర్నూలు- చిత్తూరు జాతీయ రహదారిలోని దేవపట్ల బస్టాప్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన టీడీపీ కార్యకర్త తిక్కం కృష్ణారెడ్డి తిరుపతిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కార్యకర్త కుటుంబానికి పార్టీ అండదండలు ఉంటాయని తెలియజేశారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

రాయచోటిటౌన్, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ఏపీ ఎన్జీవో సంఘం అండగా ఉంటుందని ఎన్జీవో సంఘం రాయచోటి తాలూకా అధ్యక్షుడు దండు వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఎన్జీవో హోంలో జరిగిన పెన్షనర్ల జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు, పెన్షనర్స్‌కు అందాల్సిన ఆర్థిక ప్రయోజనాలు, బకాయిల విషయంలో రాష్ట్ర నాయకత్వం రాజీ పడబోదన్నారు. ఏపీ ఎన్జీవోస్ అసోసి యేషన్ అన్నమయ్య జిల్లా అడ్‌హాక్ కమిటీ ఏర్పాటు కోసం రాయచోటికి విచ్చేయుచున్న ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ డీవీ రమణ పర్యటనలో పెన్షనర్‌లు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు వీసీ రెడ్డెన్న, అన్నమయ్య జిల్లా నాయకులు వెంకట్రమణ, రెడ్డికుమార్, జయచంద్రారెడ్డి, ఈశ్వరయ్య, చెంగల్‌రెడ్డి, ఏపీ ఎన్జీవోస్ అసోషియేషన్ తాలూకా సహాధ్యక్షులు పల్లవు సహదేవ తదితరులు పాల్గొన్నారు.

నాగారపమ్మకు పూజలు, బోనాలు

సుండుపల్లె, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీ ఈ డిగపల్లి సమీపంలో వెలసిన నాగారపమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంతో పాటు రాయచోటి, పీలేరు, రాజంపేట నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు.

'కల్తీ మద్యం కేసులో ముఖ్యమంత్రి చర్యలు హర్షణీయం'

రాయచోటిటౌన్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యం కేసులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చర్యలు హర్షణీయం అని ప్రజాగళం రాష్ట్ర అధ్యక్షుడు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇడగొట్టు నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తప్పు చేస్తే ఎంతటి వారైనా వదిలి పెట్టనని పార్టీ నాయకులకు హెచ్చరికలు జారీ చేయడం చంద్రబాబు నిజాయితీకి నిలువుటద్దం అన్నారు. గత ప్రభుత్వం ఒక డాక్టర్‌ని పిచ్చోడిని చేసి చంపినా, మద్యం ధర పెంచినా, ఒక మనిషిని చంపి డోర్ డెలివరీ చేసినా, పేదల ఆస్తులపైన వైసీపీ నాయకులు దాడి చేసినా, రాష్ట్రంలోని వడ్డెరులకు సంబంధించిన రిజర్వేషన్ జీవోలు తొలగించినా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ పార్టీలోని నాయకులను ఏ ఒక్కరినైనా సస్పెండ్ చేశారా అని ప్రశ్నించారు. ప్రస్తుతం రాష్ట్రంలో పరిణామాలను బట్టి చూస్తే వైసీపీ ప్రభుత్వం కన్నా టీడీపీ ప్రభుత్వం ఎంతో మేలనే చెప్పాలన్నారు. పార్టీ ఏదైనా మంచి చేసినప్పుడు మంచి అని, చెడు చేసినప్పుడు చెడు అని చెప్పలేనివారు నాయకులు కాదన్నారు.

గంగా భవానికి పూజలు

సిద్దవటం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాధవరం-1 బంగారుపేటలో ఆదివారం గంగాభవాని అమ్మవారిని పసుపు, కుంకుమతో అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు మాడా వెంకట సుబ్బరాయుడు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

రాజంపేట- పెంచలకోన బస్సు ఏర్పాటు చేయండి

నందలూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట నియోజకవర్గ ప్రజలు పెంచలకోనకు వెళ్లేందుకు రాజంపేట డిపో నుంచి ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేయాలని నందలూరు వాకర్స్‌క్లబ్ సభ్యులు ఆదివారం రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్ రాజుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వాకర్స్ ఇంటర్నేషనల్ క్యాబినెట్ డైరెక్టర్ మన్నెం రామమోహన్ మాట్లాడుతూ పెంచలకోనకు బస్సు సర్వీసు రద్దు చేయడంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. దీంతో చమర్తి జగన్‌మోహన్‌రాజు స్పందించి ఆర్టీసీ అధికారులతో మాట్లాడి పెంచలకోన- రాజంపేట బస్సు సర్వీసును పునరుద్ధరించే ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఉప్పుశెట్టి సుధీర్, మోడపోతుల రాము, గంధం గంగాధర్, గండికోట కృష్ణకుమార్, తీగలకుంట వెంకటేశ్, దాసరి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం: మండల తెలుగు యువత నాయకుడు పవన్‌కుమార్ ఇంట్లో వివాహానికి చమర్తి హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వంచారు.



చమర్తి జగన్‌మోహన్‌రాజుకు వినతిపత్రం అందజేస్తున్న వాకర్స్‌క్లబ్ సభ్యులు

కోడూరులో జిల్లా స్థాయి క్రీడా పోటీలు...

రైల్వేకోడూరు రూరల్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ సాయి డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం ఎస్.వి .జూనియర్ కాలేజ్ వారి ఆధ్వ ర్యంలో జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 బాల బాలికల విభాగంలో క్రికెట్, కబడ్డీ పోటీలను నిర్వహించారు. క్రికెట్ బాలబాలికల విభాగంలో 16 మంది, కబడ్డీ బాల బాలికల విభాగంలో 12 మంది జిల్లా స్థాయికి ఎంపికైనట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి చంద్రమోహన్ రాజు తెలిపారు. వారంతా త్వరలో రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీలు శారద, నాగేశ్వరరెడ్డి, పద్మ, పి. నీలకంఠ రావు, సునీత, మురళీకృష్ణ రెడ్డి, ఎస్.వి. తదితరులు పాల్గొన్నారు.



జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన బాలికలతో సిబ్బంది

శ్రీశైలం దేవస్థానం ఛైర్మన్‌కు సన్మానం

రాజంపేట టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం దేవస్థానం ఛైర్మన్‌గా ఎన్నికైన పోతుగుంట రమేష్‌నాయుడును ఆదివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ జనతాపార్టీ పోతుగుంట సేవలను గుర్తించి దక్షిణ భారతదేశంలో ప్రఖ్యాతిగాంచిన శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ఛైర్మన్‌గా నియమించడం అభినందించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాలరాజు, డాక్టర్ చెన్నూరు సుధాకర్, డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రియురాలు చనిపోయిందని
సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య


మృతి చెందిన ఫారూక్

రాయచోటి(నేతాజీ సర్కిల్), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రేమించిన అమ్మాయి చనిపోయిందని ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మనస్థాపానికి గురై ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కన్నకొడుకు మృతదేహాన్ని చూసి ఆ తల్లిదండ్రుల హృదయం తరుక్కుపోయింది. తాము ఎవరి కోసం బతకాలంటూ కన్నీటి పర్యంతమయ్యారు. వారి ఆర్తనాదాలు అందరినీ కంటతడి పెట్టించాయి. ఈ సంఘటన సంబేపల్లె మండలం దేవపట్ల గ్రామం ఆవులవాండ్లపల్లెలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సంబేపల్లె మండలం దేవపట్ల గ్రామం ఆవులవాండ్లపల్లెకు చెందిన బాదుల్లా బాషా, సల్మా దంపతుల కుమారుడు షేక్ ఫారూక్ (22) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడని తెలిపారు. నాలుగేళ్లుగా హైదరాబాదులో ఉద్యోగం చేస్తూ అక్కడ ఒక యువతి ప్రేమించినట్లు తెలిపారు. ఆమెకు ఏమైందో తెలియదు, కొద్దిరోజుల క్రితం ఆమె మృతి చెందిందని, దీంతో మనస్థాపానికి గురైన ఫారూక్ ఇంటికి వచ్చాడని తెలిపారు. ఆదివారం తల్లితండ్రి పొలం వద్దకు వెళ్లిన సమయంలో ఇంటిలో ఎవరూ లేకపోవడంతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు కొడుకు మృతి చెందడంతో ఇక తామెవరి కోసం బతకాలంటూ బోరున విలపించారు. విషయం తెలుసుకున్న ఏఎస్ఐ బాదుల్లా సంఘటన స్థలానికి చేరుకొని మృతికి గల కారణాలపై ఆరా తీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మనస్థాపంతో యువకుడి మృతి


మృతి చెందిన అరుణ్‌కుమార్

దువ్వూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం ఇడమడక సమీపంలో మూతపడిన ఓ డాబాలో అరుణ్‌కుమార్ (19) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం ఉదయం అందిన సమాచారం మేరకు స్థానిక పోలీసులు అక్కడకు వెళ్లి సంఘటనను పరిశీలించారు. మృతుడు ఆళ్లగడ్డ ప్రాంతంలోని యాదవవాడ గ్రామానికి చెందినవాడని ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. ప్రేమించిన విషయంలో మనస్థాపానికి గురై ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

వ్యక్తి అదృశ్యం

జమ్మలమడుగు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని భాగ్యనగర్ కాలనీలో షేక్ పెద్ద హసన్‌సాహెబ్ (45) అనే వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఇంట్లో ఎవరికీ చెప్పకుండానే ఇంటి నుంచి వెళ్లిపోయాడని ఆదివారం ఉదయం అర్బన్ పోలీసుస్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అదృశ్యమైన వ్యక్తి కోసం విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

అదుపు తప్పి చెట్టును ఢీకొన్న వాహనం


దెబ్బతిన్న కారు ముందుభాగం

వేముల, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొందిపల్లె సమీపంలో కడప-పులివెందుల ప్రధాన రహదారిలో ఓ కారు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొట్టింది. ఆదివారం సాయంత్రం జరిగిన ఈ ప్రమాదంలో కారులో ఉన్న పులివెందుల వైసీపీ నాయకుడు హాల్ గంగాధర్‌రెడ్డి, ఆయన సోదరుడు గాయపడ్డారు. చెట్టుకు ఢీకొట్టడంతో కారు ముందుభాగం దెబ్బతినింది. ఆ సమయంలో వేంపల్లె నుంచి పులివెందులకు వెళ్తున్న డీఎస్పీ మురళీనాయక్ గాయపడిన వారిని పులివెందులలోని ఓ ప్రైవేట ఆసుపత్రికి తన వాహనంలో తరలించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

కొండాపురం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.కోడూరు గ్రామం సమీపంలోని పెన్నానది వద్ద ఆదివారం పోలీసులు ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. అనంతపురం జిల్లా వీరాపురానికి చెందిన ట్రాక్టర్ అనుమతి లేకుండా నదిలో ఇసుకను తరలిస్తుండగా ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్సై శివనాగిరెడ్డి తెలిపారు. ట్రాక్టర్‌ను రెవెన్యూ అధికారులకు అప్పగించనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


మృతి చెందిన మణికంఠ

వాల్మీకిపురం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఎస్.మణికంఠ(27) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. శనివారం రాత్రి వాల్మీకిపురం మండలంలో చోటుచేసుకున్న సంఘటనపై పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మదనపల్లె ఈశ్వరమ్మకాలనీకి చెందిన ఎస్.మణికంఠ తిరుపతి నుంచి ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వస్తుండగా శనివారం రాత్రి వాల్మీకిపురం వద్ద జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో మణికంఠకు తీవ్ర గాయాలలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకునే సమయానికి ట్రాక్టర్ డ్రైవర్ పరారయ్యాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి ఎస్ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్‌షెల్టర్, సర్వీసు రోడ్డు నిర్మాణం జరిగేనా..?

- ఆరేళ్లుగా అడుగుతున్నా నిర్లక్ష్యమే
- నిబంధనలు పాటించని హైవే అధికారులు
- ఆందోళనకు సిద్ధమవుతున్న ప్రజలు


సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయకపోవడంతో రోడ్డు అంచున ఏర్పాటు చేసిన చిరువ్యాపార బండ్లు


చెన్నూరులో బస్‌షెల్టరు నిర్మించకపోవడంతో ఖాళీగా ఉన్న స్థలం ఇదే..

చెన్నూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): హైవేలో ఎలాంటి అభివృద్ధి పనులు మిగలకుండా పూర్తి చేయాలని నిబంధనలున్నా ఇప్పటి వరకు నిర్లక్ష్యమే తప్ప పనులు పూర్తిచేసే దిశగా ఒక్క అడుగు కూడా పడలేదు. ప్రజాప్రతినిధులు ప్రతి సమావేశంలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని, ప్రజలకు మంచి సౌకర్యాలు కల్పించాలని పదేపదే చెబుతున్నా వారి మాటలకు విలువ లేకుండాపోతోంది. మండల కేంద్రంలో కానీ, హైవే దారిలో గ్రామాలు ఉన్నచోట సర్వీసురోడ్లు, బస్‌షెల్టరు ఏర్పాటు చేయాలనే నిబంధనను హైవే అధికారులు పూర్తిగా తుంగలో తొక్కేశారు. దీంతో మండల కేంద్రమైన చెన్నూరు కొత్త రోడ్డులో సర్వీసు రోడ్డు, బస్‌షెల్టరు నిర్మాణం జరగక ప్రజలు పడే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. చిన్నమాచుపల్లె వద్ద తప్ప మండలంలో ఇంకెక్కడా సర్వీసు రోడ్లు చేపట్టలేదు. హైవే అధికారులు స్థలం చూపించినా దాతలు కట్టిస్తామని చెబుతున్నా పట్టించుకునే నాథుడే లేడని ప్రయాణికులు వాపోతున్నారు. ఫలితంగా బస్సుల కోసం ఎదురుచూసే సమయంలో ముఖ్యంగా వేసవికాలం, వర్షాకాలంలో ప్రయాణికులు పడే ఇబ్బందులు వర్ణణాతీతం. ఈ హైవే రోడ్డుపై కొత్త రోడ్డు ప్రాంతం మీదుగా నిత్యం వేలాది మంది ద్విచక్ర వాహనాలు, కార్లు, బస్సులలో రాకపోకలు సాగిస్తుంటారు. ఇలాంటి చోట సర్వీసు రోడ్డు ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నిస్తున్నారు. కేవలం 400 మీటర్ల మేర ఇరువైపులా సర్వీసు రోడ్డు ఏర్పాటు చేసి ఉంటే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉండేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సర్వీసు రోడ్లు, బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఆరేళ్లుగా ఇదే తంతు

2009లో హైవే కోసం తీసుకున్న స్థలంలో 2012 నాటికి రోడ్డు పూర్తయింది. ఆ తరువాత చాలా ఏళ్లకు సర్వీసు రోడ్లు, బస్‌షెల్టరు కావాలని ప్రజలు అడిగినప్పుడల్లా హైవే అధికారులు ఏదో ఒక సాకు చెప్పి తప్పించుకుంటున్నారు. దీంతో పలుమార్లు రోడ్డుపై ఆందోళన చేపట్టారు. ఇలా చేసినప్పుడల్లా హైవే మేనేజరు రావడం.. ఏవో మాయమాటలు చెప్పి తప్పించుకోవడం ఒక తంతుగా జరుగుతోంది.

ఎమ్మెల్యే చెప్పినా నిర్లక్ష్యమే..

సర్వీసు రోడ్లు, బస్‌షెల్టరు నిర్మించాలని చెన్నూరులో జరిగిన ప్రతి మండల సమావేశంలో ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి హైవే అధికారులను ఆదేశించారు. పైగా పలుమార్లు తీవ్ర స్వరంతో కూడా చెప్పడం జరిగింది. అయినా ఎమ్మెల్యే మాటలను కూడా నిర్లక్ష్యంగా కొట్టిపడేస్తున్నారు. మరి ఈ సర్వీసు రోడ్లు ఎప్పుడు వేస్తారో, బస్ షెల్టరు ఎప్పుడు కడతారో తెలియని పరిస్థితి.

ఆందోళనకు సిద్ధమవుతున్న ప్రజలు

హైవే రహదారిలో ఇప్పటి వరకు సర్వీసు రోడ్లు కానీ, బస్‌షెల్టరు కానీ చేపట్టకపోవడంతో ప్రజలు ఆందోళనకు సిద్ధమయ్యారు. స్థలం ఉన్నా నిర్మాణం చేపట్టడంలో హైవే అధికారుల నిర్లక్ష్యమే ప్రధానంగా కనిపిస్తోంది. దీంతో పలుమార్లు జిల్లా అధికారులు వచ్చి మందలించినా వారి మాటలు బేఖాతరు చేస్తున్నారు. దీంతో ఆగ్రహించిన ప్రజలు అభివృద్ధి పనుల కోసం త్వరలో ఆందోళన బాటపట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.


ఎండలోనే బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

వీవోఏల పోరాటాల ఫలితంగానే కాలపరిమితి సర్క్యులర్ రద్దు

- వీవోఏల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి



సభలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి

రాయచోటిటౌన్, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ ఆధ్వర్యంలో డీఆర్‌డీఏలోని వెలుగు పథకంలో పనిచేస్తున్న వీవోఏలు చేసిన నిరవధిక పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేసిందని వీవోఏల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి అన్నారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో వెలుగు యానిమేటర్ల జిల్లా మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ వీవోఏల అభివృద్ధికి ప్రభుత్వం నాణ్యమైన సెల్‌ఫోన్లు ఇస్తామనడం హర్షించదగ్గ విషయమన్నారు. అలాగే హెచ్‌ఆర్ పాలసీ అమలు చేసి కనీస వేతనం ఇవ్వాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.10 లక్షలు చేస్తే ప్రమాద బీమా కలుగుతుందని, చనిపోయిన వారికి మట్టి ఖర్చులు ఇవ్వడంతో పాటు సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. అనంతరం వీవోఏల సంఘం రాష్ట్ర కోశాధికారి తిరుపతయ్య మాట్లాడుతూ ఈనెల 27, 28వ తేదీల్లో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నంద్యాల వీవోఏల సంఘం జిల్లా అధ్యక్షుడు సోమన్న, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజులు, భాగ్యలక్ష్మి, వీవోఏల సంఘం నాయకులు రెడ్డెప్పరెడ్డి, కృష్ణమ్మ, సుబ్రమణ్యం, పరంజ్యోతి, ఉత్తప్ప, పవన్, ఆనంద్, నిర్మల, రెడ్డెప్ప, వారద, నాగసులోచన, శివశంకర్‌రెడ్డి, రమణారెడ్డి, శంకరమ్మ, నరసమ్మ, సుగుణమ్మ, రమణకుమారి, గురవయ్య, యానిమేటర్లు పాల్గొన్నారు.

హంద్రీ-నీవా కాలువలో విద్యార్థి గల్లంతు

- గాలింపు చర్యలు చేపట్టిన ఫైర్ సిబ్బంది


సాయికిరణ్ (ఫైల్)

మదనపల్లె, అర్బన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా కాలువలో పడి పదవ తరగతి విద్యార్థి ఆదివారం సాయంత్రం గల్లంతైన సంఘటన మదనపల్లెలో జరిగింది. విషయం తెలుసుకున్న వెంటనే మదనపల్లె ఫైర్ సిబ్బంది కాలువలో గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేదు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మదనపల్లె పట్టణం రామారావు కాలనీకి చెందిన సురేశ్, సరళ దంపతులు టమోటా మార్కెట్‌లో దినసరి కూలీలుగా పనిచేస్తారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అందులో పెద్ద కుమారుడు సాయికిరణ్ (16) స్థానిక అభ్యుదయ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఆదివారం మధ్యాహ్నం తన మిత్రులైన భానుతేజా, శేషబాబు, సాత్వికొరెడ్డిలతో కలిసి బైక్‌పై వెళ్లి వడ్డిపల్లె సమీపంలో హంద్రీ-నీవా కాలువలో ఈత ఆడటానికి దిగి గల్లంతయ్యాడు. మిత్రులు ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు తెలపడంతో వారు అక్కడికి చేరుకుని రోదించారు. ఫైర్ సిబ్బంది ఎంత గాలించినా ఆచూకీ దొరకలేదు. చీకటి పడటంతో సోమవారం ఉదయం తిరిగి గాలింపు చేపడతామని తెలిపారు.


కాలువ గట్టుపై రోదిస్తున్న మృతుడి తల్లి, బంధువులు

క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్

- స్కేటింగ్ అధికారి ఇజ్రాయిల్


జిల్లా స్థాయి స్కేటింగ్‌లో ప్రతిభ కనబరచిన విద్యార్థులు

రాజంపేట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించినప్పుడే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని స్కేటింగ్ అధికారి ఇజ్రాయిల్ అన్నారు. ఆదివారం కడప నగరంలో జిల్లాస్థాయి స్కేటింగ్ పోటీ నిర్వహించారు. ఈ పోటీల్లో రాజంపేట పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల చిన్నారులు పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో భువనేశ్వర్ గోల్డ్‌మెడల్ సాధించగా భవ్య, తేజ, సాయి, మను, మనస్విత రజత పతకాలు, జమాల్‌పల్లి కాంస్య పతకం సాధించినట్లు స్కేటింగ్ మాస్టర్ వినోద్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపుపై దాడి

- వ్యక్తి అరెస్టు.. మద్యం బాటిళ్లు స్వాధీనం

ములకలచెరువు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడుపల్లె పంచాయతీ కనుగొండవారిపల్లెలో ఆదివారం బెల్ట్‌షాపుపై దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు. గ్రామంలో మద్యం విక్రయిస్తున్న జయరాం (54)ను అరెస్టు చేసి అతని వద్ద నుంచి 38 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా బెల్ట్‌షాపులు నిర్వహిస్తే తమ దృష్టికి తీసుకురావాలని ఎస్ఐ సూచించారు.

స్నేహితుడికి చేయూత

- ఇబ్బందులు తెలుసుకుని ఆర్థికసాయం అందించిన మిత్రులు

సీకేదిన్నె, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఎవరికివారే ఎమునా తీరే చందంగా వ్యవహరిస్తున్న ప్రస్తుత సమాజంలో తమ తోటి స్నేహితుడు ఇబ్బందుల్లో ఉన్నాడని తెలిసి మిత్రులంతా కలిసి ఆర్థికసాయం అందించారు. 30 సంవత్సరాల క్రితం కలిసి చదువుకున్న స్నేహితులంతా కలిసి రూ.50వేలను మిత్రుడికి అందించారు. చింతకొమ్మదిన్నె మండలం బయనపల్లి శ్రీవెంకటేశ్వర పాఠశాలలో 1994-95సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులలో బయనపల్లెకు చెందిన తిరుమలశెట్టి రమేశ్ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇటీవల షుగర్ వ్యాధితో బాధపడుతూ ఎక్కువ కావడంతో కాలు కొంత భాగం తొలగించారు. ఈ విషయం తెలుసుకున్న పడిగెలపల్లె గ్రామానికి చెందిన అరిగెల రామచంద్ర మిగతా స్నేహితులకు సమాచారం అందించి తమవంతుగా ఎంతో కొంత సాయం చేద్దామని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు అందరూ కలిసి రూ.50 వేలు పోగు చేశారు. ఆదివారం రమేశ్ ఇంటికి వచ్చి ఈ ఆర్థికసాయం అందించారు. దీంతో రమేశ్ కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. తోటి అన్నదమ్ములే పట్టించుకోని ఈ రోజుల్లో స్నేహితులు అందించిన సాయం అభినందనీయమని పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 1994-95 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు మిత్రులు పాల్గొన్నారు.


రమేశ్‌కు ఆర్థికసాయం అందిస్తున్న మిత్ర బృందం

శ్రామికులకు ఈకేవైసీ తప్పనిసరి : పీడీ

నిమ్మనపల్లి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకంలో జాబ్‌కార్డు కలిగిన శ్రామికులు తప్పనిసరిగా ఈకేవైసీ కలిగి వుండాలని పీడీ వెంకటరత్నం తెలిపారు. ఆదివారం కొండయ్యగారిపల్లి పంచాయతీ వెంకోజిగారిపల్లిలో ఉపాధి సిబ్బంది చేపడుతున్న ఈకేవైసీ సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి హామీని పారదర్శకంగా, ఎలాంటి అవకతవకలు జరగకుండా ఉండేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాబ్‌కార్డు కలిగిన శ్రామికులకు ఈకేవేసీ తప్పనిసరి చేసినట్లు ఆయన తెలిపారు. జాబ్‌కార్డులో ఎంత మంది వుంటే అందరూ ఈకేవైసీ చేసుకోవాలన్నారు. మండలంలో మొత్తం 6377వుండగా వాటిలో డిలీట్ కాబడిన వాటిని మినహాయిస్తే మొత్తం 5377 వున్నట్లు తెలిపారు. వీటిలో ఇప్పటికే దాదాపు మూడు వేల మందికి ఈకేవైసీ చేయగా మిగిలిన వాటిని కూడా త్వరలో పూర్తి చేయాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. ఒకవేళ జాబ్‌కార్డు వుండి ఈకేవైసీ చేయించుకోకపోతే వారు ఉపాధి పనికి అనర్హులని తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీ శ్రీనివాసులు, ఏపీవో రమేశ్. టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

జాక్‌పాట్‌తో దోచుకుంటున్నారు

- గేట్ మూసేసి రైతుల ధర్నా ● మార్కెట్ యార్డు వద్ద ఉద్రిక్తత


మార్కెట్ యార్డు గేట్ మూసి ధర్నా చేస్తున్న రైతులు

గుర్రంకొండ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డులో వ్యాపారులు జాక్‌పాట్ పేరుతో దోచుకుంటున్నారని రైతులు ఆందోళనకు దిగారు. వ్యాపారుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందంటూ రైతులు ఆదివారం రాత్రి గేట్లు మూసి ధర్నా చేశారు. గుర్రంకొండ మార్కెట్ యార్డులో వ్యాపారులు రైతుల మార్కెట్‌కు తీసుకొచ్చే 100 క్రేట్‌ల టమోటాలకు 15 క్రేట్‌ల చొప్పున జాక్‌పాట్ విధానంతో దోచుకుంటున్నారని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు. జాక్‌పాట్ విధానంపై పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మార్కెట్ యార్డు గేట్లను మూసి ధర్నా చేయడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. విషయం పోలీసులకు తెలియడంతో అక్కడకు చేరుకుని రైతులకు సర్ది చెప్పారు. మార్కెట్ యార్డు సూపర్‌వైజర్ నయూక్‌బాష రైతులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని చెప్పడంతో ధర్నా విరమించారు.

దూసుకెళ్లిన ట్రాక్టర్

టమోటా మార్కెట్ యార్డులోని ఓ వ్యాపారి తమ మండీకి అడ్డంగా ట్రాక్టర్లను ఉంచారని రైతులతో వాగ్వాదానికి దిగారు. దీంతో రైతులు ట్రాక్టర్‌ను తీయకపోవడంతో వ్యాపారే ట్రాక్టర్ నడపడంతో ద్విచక్ర వాహనాలపైకి దూసుకెళ్లింది. దీంతో రెండు ద్విచక్ర వాహనాలు ధ్వంసం కాగా, ఓ ఆటో దెబ్బతింది. ఈ క్రమంలో ఆగ్రహించిన రైతులు వ్యాపారుల తీరుపై చర్యలు తీసుకోవాలంటూ అధికారులకు చెప్పినా పట్టించుకోకపోవడంతో నిరసన వ్యక్తం చేశారు. ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్న రైతులు ఫిర్యాదు చేస్తే వ్యాపారిపై కేసు నమోదు చేస్తామని ఏఎస్ఐ గజేంద్ర తెలిపారు. మార్కెట్ యార్డులో రైతులపై దాడులు, జాక్‌పాట్ విధానం, అధిక కమీషన్లపై మార్కెట్ శాఖ అధికారులు తీరు సరిగాలేదంటూ వాపోతున్నారు. జిల్లా అధికారులు కల్పించుకుని వ్యాపారుల అక్రమాలపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.


రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

మఠాధిపతి నియామకం కోసం సమావేశం

బ్రహ్మంగారిమఠం, అక్టోబర్ 12(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం బ్రహ్మం గారిమఠం మఠాధిపతి నియామకం కోసం ఈనెల 28వ తేదీన ఉదయం 11 గంటలకు పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థాన ప్రాంగణంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు దేవదాయ ధర్మదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనరు చంద్రశేఖర్ ఆజాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ ధార్మిక పరిషత్ నియమించిన అధికారి నేతృత్వంలో ఈ ఎన్నిక జరుగుతుందని, మఠా ధిపతి నియామకం కోసం మఠం శిష్యులు, ఆశావహులు హాజరై వారి సందేహాలు, సూచనలు ఆధారాలతో సహా లిఖితంగా క్లుప్తంగా తెలపాలని కోరారు. అనుకోని పరిస్థితుల్లో రాలేకపోయిన వారు కూడా తమ అభిప్రాయాలను పోస్టు ద్వారా పంపవచ్చని ఆ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి బాలికల క్రికెట్ పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థిని


సంధ్య

పుల్లంపేట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ అండర్-19 రాష్ట్రస్థాయి బాలికల క్రికెట్ జట్టుకు పుల్లం పేట ఆదర్శ పాఠశాల సెకండియర్ బైపీసీ విద్యార్థిని సంధ్య ఎంపికైంది. ఆదివారం రైల్వేకోడూరులోని ఎస్వీ జూనియర్ కళాశాలలో నిర్వహించిన సెలక్షన్స్‌లో సంధ్య ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ లీలాశ్రీహరి, పీడీ నీలకంఠరావు తెలిపారు. ఈ సందర్భంగా సంధ్యను ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ఘనంగా మంజునాథ స్వామి విగ్రహ ప్రతిష్ఠ



పూజలో పాల్గొన్న మదనపల్లె మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్

మదనపల్లె అర్బన్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): రెడ్డిగానిపల్లెలో మంజునాథ స్వామి విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం గ్రామస్తులు నిర్వహించారు. గ్రామంలో కొత్తగా మంజునాథ స్వామి ఆలయం నిర్మించి అందులో స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. వైభవంగా మూడు రోజులపాటు అన్న దానం చేపడుతున్నట్లు తెలిపారు. ఉదయం నుంచి హోమాలు, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు స్వామి దర్శన భాగ్యం కల్పించామన్నారు. మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్ తన అనుచరులతో కలిసి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయంలో 41 రోజులపాటు ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ప్రతి ఒక్కరూ పాల్గొని స్వామి వారిని దర్శనం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జగదీష్, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ శీతప్ప, టీడీపీ యూనిట్ ఇన్‌చార్జ్ మునిరాజా, మదనపల్లె మార్కెట్ డైరెక్టర్ ప్రమీల, శివశంకర్, సుబ్రహ్మణ్యం, టైలర్ కృష్ణమూర్తి, శ్రీరాములు రెడ్డి, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్యార్మీ వేడుకలు



ప్రార్థనలో పాల్గొన్న నేతలు, దర్గా కమిటీ సభ్యులు

వాల్మీకిపురం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక హసన్‌ఖాన్‌వీధిలోని సయ్యద్ ఖ్వాజాపీర్ మస్తాన్‌వల్లి దర్గాలో గ్యార్మీ పండుగ వేడుకలు చేసుకున్నారు. దర్గాలో చాదర్ సమర్పణ, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి పేదలకు అన్నదానం చేశారు. మార్కెట్ కమిటీ అధ్యక్షుడు కోసూరి చంద్రమౌళి, మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, దర్గా కమిటీ అధ్యక్షుడు సందానిబాషా, నేతలు రాజేంద్రాచారి, చాను, దర్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్రమశిక్షణే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం

పీలేరు ఆర్‌ఎస్‌ఎస్ శతజయంతి ఉత్సవంలో శ్రీధర్ రాజు, కలకడలో భానుప్రకాష్

పీలేరు రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరినీ క్రమశిక్షణ కలిగిన భారతీయ పౌరులుగా తీర్చిదిద్దడమే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ లక్ష్యమని సమరసతా సేవా ఫౌండేషన్ జిల్లా కార్యదర్శి శ్రీధర్ రాజు తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నిర్వహించిన ఆర్‌ఎస్‌ఎస్ శతజయంతి ఉత్సవంలో ఆయన మాట్లాడుతూ దేశాన్ని ప్రేమించే మస్తత్వం అలవర్చుకోవాలని సూచించారు. దేశం పురోభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇది సాధ్యం కావాలంటే ప్రతి ఒక్కరిలో దేశభక్తి తప్పని సరన్నారు. ప్రపంచ దేశాల్లో భారత్ అగ్రగామిగా ఆవిర్భవిస్తోందన్నారు. దేశం కోసం ఎంతటి త్యాగాలకైనా సిద్దంగా ఉండాలని పిలుపు నిచ్చారు. ఆయోధ్య రామ మందిర నిర్మాణంలో శ్రీరామ అక్షింతలు ఇంటింటికీ చేర్చడంలో సంఘ్ కార్యకర్తలు చూపిన అంకితభావం అభినందనీయమని ప్రశంసించారు. డాక్టర్ పేట చంద్రశేఖర్ మాట్లాడుతూ బాల్యం నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలని సూచించారు. స్వయం సేవకుల్లో కనిపించే దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం సమాజ నిర్మాణానికి మార్గదర్శకమన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రచార ప్రముఖ్ శశిధర్ రెడ్డి, పీలేరు గ్రామదేవత రౌద్రాల అంకాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ రామక్రిష్ణారెడ్డి, సురేష్, బాలా, బీఆర్ఎం సేట్, మల్లికార్జునగుప్త, సుదర్శన్ రెడ్డి, బీజేపీ రమణ తదితరులు పాల్గొన్నారు.



కలకడ సమావేశంలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక

కలకడ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక ఆర్‌ఎస్‌ఎస్ అని జిల్లా కార్యవాహ పర్వతాల భానుప్రకాశ్ అన్నారు. కదిరాయచెరువులో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రిటీషు వారి చిత్రహింసల నుంచి దేశ ప్రజలకు విముక్తి కల్పించాలనే సంకల్పంతో ఝాన్సీలక్ష్మీబాయి పోరాటం మొదలెట్టిందన్నారు. ఇదే స్ఫూర్తితో 15 మంది సభ్యులతో పురుడు పోసుకున్న ఆర్‌ఎస్‌ఎస్ ప్రస్తుతం 15 దేశాల్లో విస్తరించినట్లు తెలిపారు. దేశం కోసం శ్రమించిన సంస్థ విధి విధానాలు గ్రామ స్థాయిలో బలపడాలన్నారు. పీలేరు ఖండ కార్యవాహ మధుసూదన, వెంకటరమణ, ఎస్ఎస్ఎఫ్ మండల ప్రముఖ్ వెంకటేశు, నియోజకవర్గ టీడీపీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లక్ష్మీపసన్న కమల్‌నాథ్, ఉపసర్పంచ్ గోపాల్‌నాయుడు, మధు, రెడ్డిలక్ష్మీ, రామ కృష్ణ, భాస్కర్, గౌరం శ్రీనివాసులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో సర్వైకల్ క్యాన్సర్‌పై అవగాహన



వైద్య శిబిరానికి హాజరైన మహిళలు

కలికిరి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీలో ఆదివారం సంజీవని గ్రామీణ స్త్రీ ఆరోగ్య పరిరక్షణ పేరుతో ఆరోగ్య పరీక్షలు, అవగాహనా సదస్సు నిర్వహించారు. స్థానిక శ్రీనివాస చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అరబిందో ఫార్మా ఆర్థిక సహకారాలతో నిర్వహించిన వైద్య శిబిరంలో గర్భాశయ క్యాన్సర్ గురించి అవగాహన కల్పించారు. సర్వైకల్ క్యాన్సర్ రాకుండా పాటించాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఇందులో 40 మందికి ఉచితంగా సర్వైకల్ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో శ్రీనివాసా చారిటబుల్ ట్రస్టీ డాక్టర్ బ్రహ్మానంద రెడ్డి, సభ్యులు శ్రీనివాస రెడ్డి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ శశికుమార్ రెడ్డి, డాక్టర్ జిలాని, బాషా, షబ్బీర్ పాల్గొన్నారు. మొత్తం వైద్య పరీక్షల కోసం 193 మంది నమోదయ్యారు.

100 మందికి ఉచిత వైద్యం

గుర్రంకొండ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): సుంకరవాండ్లపల్లెలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన వచ్చింది. గుర్రంకొండ టీడీపీ నేత బాబాజాన్ ఆధ్వర్యంలో లత ఆస్పత్రి వైద్య బృందంతో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 100 మంది గ్రామస్తులకు జ్వరం, బీపీ, షుగర్, రక్త పరీక్షలను నిర్వహించి మందులు, మాత్రలను పంపిణీ చేశారు. బాబాజాన్ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం కావడంతో గ్రామాల్లో ప్రజలు జబ్బులతో బాధపడుతున్నట్లు చెప్పారు. దీంతో వైద్య శిబిరం నిర్వహించి పేదలకు ఉచిత వైద్యం చేయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు గంగాధర్ నాయుడు, ఎస్.కే.అహ్మద్, నేతలు ఎం.డీ.జమీర్, పర్వేజ్ అహ్మద్, గోపాల్, హరి, కృష్ణమూర్తి, సురేంద్ర, రమణ, ఇస్మాయిల్, ఇర్షాద్, అక్రమ్, షౌత్‌అహ్మద్, నాగరాజ, మహేష్, కిరణ్, ఫారుక్ తదితరులు పాల్గొన్నారు.

దాడిపై ప్రభుత్వాల వైఖరి సిగ్గుచేటు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): భారత సర్వోన్నత న్యాయ స్థానం ప్రధానన్యాయమూర్తి జస్టిస్ గవాయ్ మీద ఇటీవల జరిగిన దాడి దేశానికే సిగుచేటని వీసీకే పార్టీ ప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో వీసీకే పార్టీ, బాస్ సంయుక్త నిరసన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాన న్యాయమూర్తి దళితుడు కాబట్టే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా స్పందించలేదన్నారు. సంఘటనకు పాల్పడిన మత ఉన్మాది రాకేష్ కిషోర్‌కు భారత పౌరసత్వం రద్దు చేసి దేశ బహిష్కరించాలని డిమాండ్ చేశారు. బాస్ నేతలు నీరుగట్టు రమణ, రెడ్డెప్ప, గంగాధర్, రమణ, సింగన్న, శ్రీనివాసులు, రవి, జనార్థన్, రాజేష్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఏఐబీఎస్ఎస్ జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక



ఆల్ ఇండియా బంజార సేవా సంఘం జిల్లా నూతన కమిటీ సభ్యులు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా భూక్య నాగునాయక్, ప్రధాన కార్యదర్శిగా శంకర్‌నాయక్, కోశాధికారిగా బనావత్ రవీంద్ర నాయక్, యూత్ కన్వీనర్‌గా మనోజ్‌కుమార్ నాయక్ నియమితులయ్యారు. విజయవాడలో జరిగిన ఎన్నిక సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు చక్రి నాయక్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో బంజారాలను అభివృద్ధి చేయడానికి కార్యవర్గాన్ని నియమించామన్నారు. ఎన్నికైన అధ్యక్షుడు మదనపల్లె మున్సిపల్ కౌన్సిలర్‌గా బంజారాలకు బ్యాంకు లింగేజీ రుణాలు, ఇళ్లపట్టాలు, కాలనీలో సీసీరోడ్డు, తాగునీరు, మురుగునీటి కాల్వలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. త్వరలో జిల్లాలో ఉన్న తండాలు, బిడికీల్లో పర్యటించి అక్కడి సమస్యలను తీర్చాడానికి ప్రయత్నం చేశారన్నారు. ఈ సందర్భంగా నక్కలదిన్నె తండాలో ఆయన అభిమానులు పెద్దఎత్తున సంబరాలు చేసుకున్నారు.

కమ్యూనిస్టు నేత నాయుడు మరణం ఉద్యమానికి లోటు

సంతాపం తెలిపిన జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు



నాయుడు భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు సీనియర్ నేత ఎంఎస్ నాయుడు ఆదివారం మదనపల్లెల్లో తుదిశ్వాస వదిలారు. ఈ సందర్భంగా సీపీఎం నేతలు శ్రీనివాసులు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, మదనపల్లె నియోజకవర్గ కార్యదర్శి ముబారక్ తదితరులు నాయుడు మృతదేహం సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ బతికినంత కాలం నిబద్ధతతో ఉద్యమాల్లో పాల్గొన్నారని, కార్మికుల హక్కుల కోసం, నిరంతరం పోరాటం చేశాడని గుర్తు చేశారు. వయస్సు మీద పడినా ఉద్యమాల్లో తన ప్రాత పోషించాడని గర్వంగా చెప్పారు. రైల్వే ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూ పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో కార్మిక ఉద్యమంలో చురుకుగ్గా పాల్గొన్నారన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం మదనపల్లె ప్రాంతాల్లో కార్మిక ప్రజా ఉద్యమాల్లోను, పార్టీతో సంబంధం లేకుండా ఉద్యమాల బాట పట్టారన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నేతలు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

గృహిణి ఆత్మహత్య



ఖైరున్నిసా మృతదేహం

పీలేరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలతో గృహిణి ఖైరున్నిసా(48) ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం పీలేరులో చోటు చేసుకున్న సంఘటనపై పోలీసుల కథనం మేరకు.. పీలేరు పట్టణం బోయపాళెం వీధి వాసి నజీర్ భార్య ఖైరున్నిసా కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. పలుచోట్ల వైద్యం తీసుకున్నా స్వస్థత చేకూరక పోవడంతో కుటుంబ సభ్యులకు భారంగా మారినట్లు భావిస్తూ ఆమె డిప్రెషన్‌లోకి వెళ్లింది. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో ఇంట్లోనే ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబీకులు ఆమెను పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆస్పత్రి వర్గాల సమాచారం మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

కట్ట బలోపేతం పనులు వేగవంతం



పేటచెరువు కట్ట బలోపేతం పనులు చేస్తున్న దృశ్యం

పెద్దమండ్యం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి) పేటచెరువు కట్ట బలోపేతం అభివృద్ధి పనులు ఆదివారం వేగవంతం చేశారు. మండలంలో శుక్రవారం, శనివారం తెల్లవారు జామున కురిసిన వర్షం, ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వర్షం నీరు చెరువులోకి చేరాయి. దీంతో వర్షపునీటితో నిండడంతో చెరువుకట్ట మొరవ వద్ద ప్రమాద పరిస్థితి నెలకొందని రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎంపీడీఓ శ్రీధర్‌రావు వివిధ శాఖాధికారులు చెరువుకట్ట పరిస్థితిని శనివారం పరిశీలించి ఆదివారం ఎంపీడీఓ ఆధ్వర్యంలో పేటచెరువు కట్ట బలోపేతం పనులను చేపట్టారు. పనులను రైతులు కూడా పరిశీలించారు. సకాలంలో చెరువు కట్ట పనులు చేపట్టడంతో ఆయకట్ట రైతులు హర్షం వ్యక్తం చేశారు.

అనారోగ్యంతో ఏఈఓ మృతి



కలకడ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): కలకడ మండల వ్యవసాయ శాఖ అధికారి కోనేటి శ్రావణ్ కుమార్ అనారోగ్యంతో ఆదివారం కన్నుమూశారు. ఆయన అంత్యక్రియలు సోమవారం కేవీ పల్లె మండలం మారెళ్ల పంచాయతీ రెడ్డివారి పల్లెలో జరుగుతాయని ఆయన తండ్రి పరశురాం తెలిపారు. శ్రావణ్‌కు భార్య, కూతురు ఉన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో 18 మందికి ఉద్యోగాలు

మదనపల్లె టౌన్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 18 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఆదివారం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో బెంగళూరుకు చెందిన ఎకోబ్రెయిన్స్ సంస్థ ప్రతినిధులు నిర్వహించిన ఇంటర్వ్యూలో 50 మంది ఫైనలియర్ విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ఉత్తమ ప్రతిభ చూపిన 18 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. వీరికి వార్షిక వేతనంగా రూ.3.50లక్షలు ఇవ్వనున్నట్లు కళాశాల డైరెక్టర్ రామలింగారెడ్డి తెలిపారు. కాగా ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ పి.రాయుడు, ప్లేస్‌మెంట్ అధికారి సి.మనోజ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.